# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

## ఉక్రెయిన్‌లో శాంతి

**ఆత్మరక్షణ** పేరిట ఉక్రెయిన్‌పై రష్యా జరిపిన దాడి ఎడతెగని యుద్ధంగా మారింది. వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్ తదితర నాటో కూటమి దేశాలు ఉక్రెయిన్‌కు ఆయుధాలు, ఇతరత్రా సాయం అందిస్తున్నాయి. రష్యాకు చైనా, ఉత్తరకొరియా వంటి దాని మిత్రదేశాలు తమవంతుగా తోడ్పాటు అందిస్తున్నాయి. యుద్ధం మొదలై రెండేండ్లు దాటినా ముగింపు కనుచూపు మేరలో కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌పై జరిగిన శాంతి శిఖరాగ్ర సభ మిశ్రమ ఫలితాలనిచ్చింది. గత వారాంతంలో స్విట్జర్లాండ్‌లోని బర్జెన్ స్టాక్ విడిది కేంద్రంలో జరిగిన ఈ సమావేశానికి అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్ దేశాల నేతలు, అనేక ఇతర దేశాల విదేశాంగ మంత్రులు, దౌత్యాధికారులు పాల్గొన్నారు. యుద్ధంలో ప్రధాన పాత్రధారి రష్యా గానీ, మిత్రదేశమైన చైనా గానీ హాజరు కాకపోవడం గమనార్హం.

పేరుకు ఇది శాంతి శిఖరాగ్ర సభ అయినప్పటికీ ఇది యుద్ధ పరిసమాప్తి కోసం ఏర్పాటైంది కాదనేది మొదటినుంచీ అందరూ భావిస్తున్నదే. కీలక అంశాలపై ఉమ్మడి దృక్పథం పేరిట సమావేశం చివరన ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో ఉక్రెయిన్ అణుకేంద్రాల భద్రతపై అంతర్జాతీయ పర్యవేక్షణ, గోధుమల రవాణా నిరాటంకంగా సాగేందుకు వీలు కల్పించడం, కాందిశీకులు తిరిగి తమ ఇండ్లకు తరలి వెళ్లడంలో తోడ్పాటు అందించడం అనే మూడు ప్రధాన లక్ష్యాలను పేర్కొన్నారు. ఈ ప్రకటనపై పశ్చిమ దేశాలకు అనుకూలమైన 82 దాకా దేశాలు సంతకాలు చేశాయి. సమావేశానికి ఆతిథ్యం ఇచ్చిన స్విస్ అధ్యక్షురాలు వయోలా ఆమ్‌హెర్డ్ దీనిని 'భారీ మెజారిటీ'గా అభివర్ణించినప్పటికీ అనేక దేశాలు సంతకం చేసేందుకు నిరాకరించడం చర్చాంశమైంది. అందులో భారత్ కూడా ఉంది. రష్యా హాజరు కాలేదనే కారణంగా భారత్ ఉమ్మడి ప్రకటనకు దూరంగా ఉండిపోయింది.

రష్యాకు ఆహ్వానమే పంపకపోవడం, సమావేశాన్ని రష్యా 'వృథాప్రయాస'గా కొట్టిపారేయడం తెలిసిందే. చైనాకు సన్నిహితంగా మెలిగే పాకిస్థాన్‌కు ఆహ్వానం వెళ్లినా ఆ దేశం తిరస్కరించింది. ప్రధాన పక్షాలు లేకుండా సమస్యకు పరిష్కారం సాధ్యం కాదనేది భారత్ వాదనగా ఉన్నది. సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, ఇండోనేషియా తదితర దేశాలూ భారత్ బాటలోనే నడిచాయి. ఉక్రెయిన్ ప్రాదేశిక సమగ్రతను కాపాడాలన్న అంశం కూడా సదస్సులో విభేదాలకు కారణమైంది. ఐక్యరాజ్య సమితి కమిషన్ ముందు యుద్ధనేరాల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇజ్రాయెల్ సదస్సుకు హాజరు కావడం, ఉమ్మడి ప్రకటనపై సంతకం చేయడాన్ని దక్షిణాఫ్రికా ఎత్తిచూపింది. శాంతి కృషి సఫలం కావాలంటే ఇరుపక్షాలూ హాజరుకావడం, చిత్తశుద్ధితో చర్చల్లో పాల్గొని, సందర్భాన్ని బట్టి రాజీపడటం తప్పనిసరి. భారత్ అభిప్రాయం కూడా అదే.

# తెలంగాణ వెలుగు దివ్వెగా ఎట్లయ్యిందంటే..

ఉమ్మడి ఏపీ నుంచి విడిపోయి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడే నాటికి కరెంటు కొరతతో, కోతలతో తెలంగాణ విలవిలలాడిపోయేది. గడిగడికి కరెంటు పోయేది.

చిమ్మచీకట్లో, దీపం వెలుతురులో పొయ్యి మీద బువ్వ వండిన దినాలు ఇప్పటికీ గుర్తే. నీళ్లు పెడుదామని పొలం కాడికి రాత్రిళ్లు పోయిన రైతన్నలకు పురుగు పుట్ర, పాములు కరిచిన ఉదంతాలెన్నెన్నో జరిగినయ్.

కరెంటు కోతలతో కంపెనీలకు పవర్ హాలీడేలు నిత్యకృత్యం. గసొంటి స్థితి నుంచి ఇప్పుడు దేశంలోనే అత్యధిక స్థాపిత విద్యుత్తు సామర్థ్యం కలిగిన రాష్ట్రంగా తెలంగాణ రికార్డులకెక్కడం వెనుక ఎలాంటి కృషి, కఠోర శ్రమ ఉన్నదో తెలుసా?



కడవేర్గు రాజశేఖర్

సమైక్య పాలనలో తెలంగాణలోని గ్రామాల్లో ఉదయం 3 గంటలు, సాయంత్రం 3 గంటలు మాత్రమే 3 ఫేజ్ విద్యుత్తు సరఫరా అయ్యేది. ఇక రాత్రంతా కేవలం సింగిల్ ఫేజ్ కరెంటు మాత్రమే ఉండేది. ఇది కేవలం పల్లె సీమల పరిస్థితే కాదు, మండల కేంద్రాల్లోనూ ఏకంగా 8 గంటల పాటు కరెంటు కోతలుండేవి. మున్సిపాలిటీల్లో 6 గంటల పాటు, రాజధాని హైదరాబాద్‌లోనూ ఏకంగా 4 గంటల పాటు పవర్ కట్ ఉండేది. ఇక పారిశ్రామిక రంగం పరిస్థితి మరీ దారుణం. పరిశ్రమలకు వారానికి రెండు రోజులు పవర్ హాలీడే ప్రకటించిన రోజులవి. రైతులు, కార్మికులు, సామాన్యులు ఇలా ప్రతి ఒక్కరూ కరెంటు కోతల బాధితులే. చివరికి ఎవరైనా చనిపోతే, అంత్యక్రియల సమయంలో స్నానాలు చేయడానికి కూడా నీళ్లు లేని దుస్థితి నాటిది. ఇలాంటి పరిస్థితిలో ఉమ్మడి ఏపీ నుంచి తెలంగాణ విడిపోయింది.

తెలంగాణకు విద్యుత్తు ప్రాణావసరమని, ఈ ప్రాంతంలో వ్యవసాయ రంగంలో కరెంటు వాడకం ఎక్కువనీ, అందువల్ల విద్యుత్తు పంపకంలో తెలంగాణ రాష్ట్రానికి అధిక వాటా కేటాయించాలని రాష్ట్ర ఏర్పాటు చర్చల్లో తెలంగాణ నేతలు గట్టిగా వాదించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం నాటి ఉమ్మడి రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే కరెంటులో 53.89 (దాదాపు 54 శాతాన్ని) తెలంగాణకు, 46.11 శాతాన్ని విభజిత ఏపీకి కేటాయించింది. ఉమ్మడి ఏపీలో 2014కు ముందు ఐదేండ్ల కరెంటు వాడకాన్ని పరిగణనలోకి తీసుకొని మరీ కేంద్రం ఈ వాటాలను ఖరారు చేసింది. దీన్ని కచ్చితంగా పాటించాలని కూడా రాష్ట్ర విభజన చట్టంలో సుస్పష్టంగా పేర్కొన్నది.

### సీలేరు విద్యుదుత్పత్తి కేంద్రంపై కుట్ర

అయితే తదనంతర పరిణామాలు ఇందుకు భిన్నంగా జరిగాయి. నాటి సమైక్య పాలకులు, ఆంధ్రా పార్టీలు, నాయకుల అభీష్టానికి విరుద్ధంగా ఏర్పాటైన తెలంగాణను ఎలాగైనా విఫల రాష్ట్రంగా చూపించడానికి సమైక్య పాలకులు కంకణం కట్టుకున్నారు. తెలంగాణను దెబ్బకొట్టడానికి వారు ఎంచుకున్న మొట్టమొదటి అస్త్రం కరెంటు. ఆంధ్రాతో కలిసి లేకుంటే తెలంగాణ చీకట్లో మగ్గిపోతుందని అంతకు ముందే పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ హెచ్చరికలు జారీచేసిన సమైక్య పాలకులు, రాష్ట్ర ఏర్పాటు తర్వాత అన్నంత పనీ చేయడానికి తెగబడ్డారు. కరెంటు లేకుంటే తెలంగాణ బతుకలేని, చావలేని దయనీయ స్థితిలో పడుతుందనే ఎత్తుగడ వేసి, పెను దుర్మార్గానికి తెరతీశారు. ఇందులో భాగంగా రాష్ట్ర విభజన చట్టాన్ని నిర్లజ్జగా ఉల్లంఘించారు. నాటి కేంద్ర ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేసి, బెదిరించి, విభజన చట్టాన్ని తుంగలో తొక్కి, తెలంగాణ (ఖమ్మం జిల్లాలోని) 7 మండలాలతో పాటు సీలేరు విద్యుదుత్పత్తి కేంద్రాన్ని గుంజుకుపోయారు. తెలంగాణకు సీలేరు పవర్ ప్రాజెక్టు ఎంత ముఖ్యమైనదంటే, ఏడాదిలో 300 రోజులు కరెంటు ఉత్పత్తి చేసే (అత్యధిక ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ ఉండే) ప్రాజెక్టు అది. అది కూడా అత్యంత అగ్వ ఖర్చుతో. అందులో కేవలం 85 పైసలకే యూనిట్ కరెంటు ఉత్పత్తి అయ్యేది. సీలేరును ఆంధ్రా గుంజుకుపోవడంతో తెలంగాణ ఏకంగా 450 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాన్ని కోల్పోయింది. న్యాయంగా తెలంగాణకు రావాల్సిన విద్యుత్తు సరఫరాను కూడా ఆంధ్రా పాలకులు నిలిపివేశారు.



**పదేండ్ల తెలంగాణలో వెలుగు జిలుగులు ఇలా..**

| అంశం | 2014 | 2023 |
|---|---|---|
| విత్యుత్తు స్థాపిత సామర్థ్యం (మెగావాట్లలో) | 7,778 (2.6.2014) | 19,464 (1.10.2023) |
| సౌర విద్యుత్తు సామర్థ్యం (మెగావాట్లలో) | 74 (2.6.2014) | 6,106 (1.10.2023) |
| గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ (మెగావాట్లలో) | 5,661 (6.6.2014) | 15,497 (30.3.2023) |
| గరిష్ఠ విద్యుత్తు వినియోగం (మిలియన్ యూనిట్లు) | 128 (6.6.2014) | 297.89 (14.3.2023) |
| తలసరి విద్యుత్తు వినియోగం (యూనిట్లు) | 1,196 | 2,349 |

### ఛత్తీస్‌గఢ్‌తో డీల్

దీంతో తెలంగాణలో కరెంటు డిమాండ్-సప్లై మధ్య భారీ అంతరం ఏర్పడింది. రాష్ట్రంగా ఏర్పడేనాటికి తెలంగాణలో అందుబాటులో ఉన్న మొత్తం విద్యుత్తు కచ్చితంగా చెప్పాలంటే 4155.5 మెగావాట్లు మాత్రమే. అప్పటి (2014) వినియోగాన్ని అనుసరించే మనకు దాదాపు 2,700 మెగావాట్ల కొరత ఉంది. మరోవైపు విభజన చట్టాన్ని ఉల్లంఘించి ఆంధ్రప్రదేశ్ కరెంట్ సరఫరాను ఎగవేయడం వల్ల 1,500 మెగావాట్లు, గ్యాస్ ఆధారిత విద్యుత్తు రాకపోవడం వల్ల 900 మెగావాట్లు కలిపి మరో 2,400 మెగావాట్ల లోటు ఏర్పడింది. వెరసి మొత్తమ్మీద సుమారు 5,000 మెగావాట్ల కొరతతో తెలంగాణలోని విద్యుత్తు రంగంలో తీవ్ర సంక్షోభం ఏర్పడింది. ఇటువంటి విపత్కర పరిస్థితిలో నాటి తెలంగాణ ప్రభుత్వం తక్షణం స్పందించింది. రాష్ట్రం చీకట్లో మగ్గకుండా.. తప్పనిసరి పరిస్థితిలో ఎక్కడ కరెంటు దొరికితే అక్కడ కొనాలని నిర్ణయించుకున్నది. ఈ క్రమంలో అధికారుల పరిశీలనలో ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో మిగులు విద్యుత్తు ఉన్నట్టు తేలింది. ఈ రెంటిలో ఛత్తీస్‌గఢ్ తెలంగాణకు పొరుగునే ఉన్నది. దీంతో 2014లో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమక్షంలో ఛత్తీస్‌గఢ్ నుంచి వెయ్యి మెగావాట్ల విద్యుత్తును తెలంగాణ కొనుగోలు చేయడానికి రెండు రాష్ట్రాల విద్యుత్తు కార్యదర్శుల మధ్య ఒప్పందం కుదిరింది. అలా కరెంటు కష్టాలు కొంతవరకు తీరాయి.

### స్వావలంబనే పరిష్కారం

విద్యుదుత్పత్తిలో స్వావలంబన సాధిస్తేనే తెలంగాణకు కరెంటు కష్టాలు తీరడంతో పాటు అన్నిరంగాల్లో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకుపోతుందని గ్రహించిన కేసీఆర్ స్థాపిత విద్యుత్తు సామర్థ్యాన్ని పెంచాలని నిర్ణయించారు. ఈ క్రమంలో విద్యుత్తు కేంద్రాల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. అలా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు కేవలం 7,778 మెగావాట్లుగా ఉన్న స్థాపిత విద్యుత్తు సామర్థ్యం.. కేసీఆర్ దూరదృష్టితో తొమ్మిదిన్నరేండ్లలోనే 150 శాతం వరకూ పెరిగి సుమారు 20 వేల మెగావాట్లకు చేరుకున్నది. కేసీఆర్ దృఢ సంకల్పం, పటిష్ఠమైన కార్యాచరణతో కేటీపీపీ నుంచి 600 మెగావాట్లు, లోయర్ జూరాల నుంచి 240 మెగావాట్లు, పులిచింతల నుంచి 120 మెగావాట్లు, కేటీపీఎస్ (స్టేజ్-7) నుంచి 800 మెగావాట్లు, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నుంచి 1,080 మెగావాట్లు, సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి 1,200 మెగావాట్లు, సౌర విద్యుత్తు నుంచి 6,106 మెగావాట్లు, పవన విద్యుత్తు నుంచి మరో 128 మెగావాట్లు ఇలా మొత్తంగా గత అక్టోబర్ 1 నాటికి తెలంగాణలో స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 19,464 మెగావాట్లకు పెరిగింది. దేశంలోనే ఇది రికార్డు. ఇదే పదేండ్ల సమయంలో దేశంలో స్థాపిత విద్యుత్తు సామర్థ్యం కేవలం 69 శాతం మేర పెరగడం గమనార్హం. 2014లో రాష్ట్రం ఆవిర్భవించిన నాడు తెలంగాణ తలసరి విద్యుత్తు వినియోగం 1,196 యూనిట్లుగా ఉంటే, తొమ్మిదిన్నరేండ్లలోనే అది 2,349 యూనిట్లకు పెరిగింది. అలా పదేండ్ల కేసీఆర్ పాలనలో చీకట్లలో మగ్గే దుస్థితి నుంచి తెలంగాణ వెలుగుల దివ్వెగా మారింది.

**స్థాపిత విద్యుత్తు సామర్థ్యం ఇలా.. (మెగావాట్లలో)**

| అంశం | 2014లో | 2023లో | పెరుగుదల | పెరుగుదల (శాతం) |
|---|---|---|---|---|
| తెలంగాణ | 7,778 | 19,464 | 11,686 | 150.2 |
| ఉత్తరప్రదేశ్ | 14,293 | 31,411 | 17118 | 119.76 |
| తమిళ నాడు | 19,533 | 38,248 | 18715 | 95.81 |
| గుజరాత్ | 26,414 | 48,566 | 22,152 | 83.86 |
| బెంగాల్ | 8,616 | 15,544 | 6928 | 80.4 |
| మహారాష్ట్ర | 30,354 | 44,751 | 14,397 | 47.43 |
| భారత్ | 2,45,259 | 4,16,059 | 1,70,800 | 69.64 |

**తెలంగాణలో పదేండ్లలో వసతుల కల్పన ఇలా..**

| వసతులు | 2014 | 2023 (అక్టోబర్) |
|---|---|---|
| 400 కేవీ సబ్ స్టేషన్లు | 6 | 27 |
| 220 కేవీ సబ్ స్టేషన్లు | 51 | 103 |
| 132 కేవీ సబ్ స్టేషన్లు | 176 | 252 |
| ఈహెచ్‌టీ సబ్ స్టేషన్లు | 233 | 382 |
| 33 కేవీ సబ్ స్టేషన్లు | 2,138 | 3,212 |
| ఈహెచ్‌టీ లైన్లు (సర్క్యూట్ కి.మీ.ల్లో) | 16,379 | 28,356 |
| ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం (ఎంవీఏ) | 14,973 | 40,640 |

### విద్యుత్తుతో సర్వోన్నతాభివృద్ధి


కేసీఆర్ ఉక్కు సంకల్పంతో రాష్ట్రం ఏర్పడిన కేవలం ఆరు నెలల్లోనే 24 గంటల నిరంతరాయ విద్యుత్తు సరఫరా సుసాధ్యమైంది. స్థాపిత విద్యుత్తు సామర్థ్యం అంచనాలకు మించి అందుబాటులోకి రావడం, నిరంతర విద్యుత్తుకు ఆకర్షితులై ఐటీ కంపెనీలు హైదరాబాద్‌కు క్యూ కట్టాయి. 2014లో కేవలం 57 వేల కోట్లున్న తెలంగాణ ఐటీ ఎగుమతులు 2020 నాటికి 2.41 లక్షల కోట్లకు పెరిగాయి. ఏటా లక్షలాది మోటార్లు కాలే స్థితి నుంచి సాగునీటితో పంట పొలాలు కళకళలాడే రోజులు వచ్చాయి. పారిశ్రామిక, వ్యావసాయిక ప్రగతి జరిగింది. దేశానికే తెలంగాణ ధాన్యాగారమైంది. జనరేటర్లు, ఇన్వర్టర్లు, కన్వర్టర్లు మాయమై.. హైదరాబాద్ వంటి నగరాలే కాదు ఆదిలాబాద్‌లోని కుగ్రామాలు కూడా నిరంతరాయ విద్యుత్తు వెలుగులతో ధగధగలాడాయి. తెలంగాణలో 'ఒకప్పుడు కరెంటు ఉంటే వార్త, ఇప్పుడు కరెంటు పోతే వార్త' అనే నినాదం ప్రపంచవ్యాప్తంగా మార్మోగింది. పదేండ్లలో కేసీఆర్ సర్కారు విద్యుత్తు రంగంలో తీసుకొచ్చిన సంస్కరణ ఫలమే ఇది.

## కుటుంబమంతా పార్లమెంట్‌లోనే!

కాంగ్రెస్ రాజకీయ పార్టీ కాదు, ఒక కుటుంబం నడిపించే కంపెనీ అని మరోసారి నిరూపితమైంది. ఇప్పటికే సోనియాగాంధీ రాజ్యసభ ఎంపీగా ఉన్నారు. రాహుల్‌గాంధీ రాయ్‌బరేలీ సీటును అంటిపెట్టుకుంటారు. అంతేకాకుండా, వయనాడ్ నుంచి ప్రియాంకాగాంధీ పోటీ చేయాలని వారు కోరుకుంటున్నారు. అంటే, వాళ్ల కుటుంబమంతా పార్లమెంట్‌లోనే ఉంటుంది.

- షెహజాద్ పూనావాలా, బీజేపీ నేత







## కుట్రల చట్రంలో అస్తిత్వం!

*కుట్రలు కంటికి కనిపించేంత స్పష్టంగా, ఆలోచనలకు అందేంత విపులంగా ఉండవు. అవి తేనె పూసిన కత్తుల్లా ఉంటాయి. విప్లవోద్యమంలో కోవర్టుల్లా ఉంటాయి. తీపికి భ్రమిస్తామో గొంతుకలను తెగ్గోస్తాయి. నమ్మకంతో కునుకు తీశామో దళాలకు దళాలనే అంతమొందిస్తాయి. ప్రమాదం పైకి కనిపించని ఊబిలా ఉంటుంది. కాలు మోపామో కాన రానంత లోతులోకి కూరుకుపోతాము.*

ఇవ్వాల తెలంగాణ అస్తిత్వం కూడా ఇలాగే అనేక కుట్రల చట్రంలో బందీ చేయబడుతున్నది. ఒకవైపు పాలకుల అణచివేతల కుట్రలు, మరోవైపు వివిధ పార్టీల స్వార్థపూరిత రాజకీయ కుట్రలు. ఇంకో వైపు పరోక్షంగా సీమాంధ్ర పెట్టుబడిదారుల అసత్య ప్రచారాల కుట్రలు. ఇంకా తెలంగాణ అస్తిత్వాన్ని నీరుగార్చాలనే ఉద్దేశంతో రాజముద్రలో రాచరికపు ఆధిపత్య పెత్తనపు ఆనవాళ్లున్నాయని తెలంగాణ చారిత్రక సాంస్కృతిక ఆనవాళ్లను చెరిపివేసే కుట్రలు. ఉద్యమ నేతల వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్న మీడియా కుట్రలు. తెలంగాణలో పుట్టి, తెలంగాణకే ద్రోహం చేస్తున్న ఇక్కడి నేతల కుట్రలు. కంటికి స్పష్టంగా కనిపించని, ఆలోచనలకు విస్పష్టంగా అందని, అభివృద్ధి ఆచరణను అస్థిరపరచే ఇన్నిరకాల కుట్రలను ఛేదించి, మన కర్తవ్యాన్ని బోధపర్చుకొని సంపూర్ణ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మరో పోరాటానికి సిద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైంది.




తెలంగాణకు ఇప్పటికింకా సంపూర్ణ స్వాతంత్ర్యం సిద్ధించనే లేదు. ఎప్పుడూ ఎవరో ఒకరి పరోక్ష ఆధీనంలో పరాధీనంగానే ఉండిపోతున్నది. ఇకపై ఏ ఆంక్షల్లేని, ఎలాంటి వివక్షలకు తావులేని, పౌర హక్కులకు భంగం వాటిల్లని, ప్రజాస్వామిక విలువలతో కూడుకున్న తెలంగాణ నిర్మాణానికి అడుగులు వేయాలి. సాహితీవేత్తల భావుకతల్లో, సిద్ధాంతకర్తల ఉపన్యాసాల్లో, ఉద్యమకారుల ఆకాంక్షల్లో, కళాకారుల ఆటపాటల్లో వ్యక్తమైన తెలంగాణ ఎలా ఉండాలో, ఎన్నికల సమయంలో తెరమీదికి వచ్చి, ఎన్నెన్నో కబుర్లు చెప్పిన నాయకులకు ఏం తెలుస్తుంది? తెలంగాణ ఆత్మను స్పృశించే అవగాహన కానీ, అర్హత కానీ వారికి ఎక్కడ ఉంటుంది?

భాష, సంస్కృతి, చరిత్ర, కళలు అన్నీ విధ్వంసానికి గురై ఆత్మన్యూనతలోకి నెట్టివేయబడ్డ స్థితిలోంచి, అస్తిత్వ మూలాలను పునర్బలోపేతం చేసుకొని, సాంస్కృతిక పునరుజ్జీవన లక్ష్యంగా ముందుకు సాగినప్పుడే సంపూర్ణ తెలంగాణను సాధించుకున్నట్టు లెక్క. వలసవాదులు స్థిరపరచిన వ్యాపార సంస్కృతి నుంచి, ఆధిపత్య భావనల నుంచి మనల్ని మనం విముక్తి చేసుకొని, ఇదీ తెలంగాణ భాషా సంస్కృతుల వైభవం, ఇదీ తెలంగాణ భౌతిక వికాసం, మానవీయ విలువలు అంతస్సూత్రంగా కలిగిన తెలంగాణ అభివృద్ధి ఇదీ అని ప్రపంచానికి చాటిచెప్పడం కోసం మనమంతా అస్తిత్వ స్పృహతో ఏకం కావలసిన సందర్భం. నూతన పంథాలో, పదునైన ఆలోచనలతో, కొత్త కొత్త ఎత్తుగడలతో ప్రజలను పోరాటాలకు సిద్ధం చేయాల్సిన సమయం. ఆ బాధ్యత తెలంగాణలో ఉన్న విద్యావంతులు, మేధావులు, బుద్ధిజీవులు, మొత్తంగా తెలంగాణ పౌర సమాజం, ముఖ్యంగా బీఆర్‌ఎస్ నాయకత్వంపై ఉన్నది.



నారదాసు లక్ష్మణ్‌రావు
(వ్యాసకర్త: బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

## పార్లమెంటులో లిబరేషన్

**పార్లమెంట్‌లో** సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రెండు సీట్లు గెలిచి వామపక్ష శ్రేణులకు నూతనోత్తేజాన్ని కలిగించింది. బీహార్‌లోని ఆరా, కరాకట్ నియోజకవర్గాల నుంచి లిబరేషన్ అభ్యర్థులు విజయం సాధించారు. భారత గడ్డపై ఫాసిస్టు శక్తుల పెరుగుదల అత్యంత ప్రమాదకరంగా పరిణమించిన నేపథ్యంలో ప్రతిపక్షాలను ఒక్కతాటిపైకి తెచ్చేందుకు లిబరేషన్ తన వంతు కృషిచేస్తూ 'ఇండియా'లో భాగస్వామిగా మారింది.

మొదట సాయుధ మార్గాన్ని అనుసరించిన లిబరేషన్ పార్టీ 1985 ఎన్నికల్లో తొలిసారిగా పాల్గొన్నది. 1989లో పార్లమెంటు, 1990 అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో నిలిచి ఆశ్చర్యకరమైన ఫలితాలను సాధించింది. 1989లో తొలిసారిగా రామేశ్వర ప్రసాద్‌ను ఆరా నియోజకవర్గం నుంచి పార్లమెంటుకు పంపింది. ఆ తర్వాత అసోంలోని కర్బీ అంగ్లాంగ్ నుంచి పలుమార్లు జయంత రోంగ్పి లిబరేషన్ నుంచి పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహించారు. సుదీర్ఘకాలం తర్వాత మళ్లీ ఇద్దరు ఎంపీలను బీహార్‌లో లిబరేషన్ గెలిపించుకున్నది. ఆ పార్టీ ప్రతినిధులు సుధామ ప్రసాద్, రాజారామ్ సింగ్‌లు తమ గొంతును పార్లమెంటులో వినిపించనున్నారు. ఫాసిస్టు బీజేపీని ఎదుర్కోవడం కోసం నిరంతరం పార్లమెంటు లోపలా, బయట వారు పోరాడుతారు. ప్రస్తుతం పార్లమెంట్‌లో సీపీఎంకు నలుగురు, సీపీఐకి ఇద్దరు, లిబరేషన్‌కు ఇద్దరు, ఆర్‌ఎస్పీకి ఒకరు వెరసి మొత్తం లెఫ్ట్ పార్టీల బలం తొమ్మిదికి పెరిగింది.

- మామిండ్ల రమేష్ రాజా